నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శుక్రవారం | జులై 05, 2024 | www.navatelangana.com

ఘనంగా రోశయ్య జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్‌



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. దిగ్గజనేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా శాసనమండలి సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌ ఆయన అందించిన సేవలను సంఘం ప్రతినిధులు స్మరించుకున్నారు. మంత్రిగా 16 సార్లు రోశయ్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. మహానేత ఆర్యవైశ్యుడు కావడం కులస్తుందరికి గర్వకారణమన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాజకీయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనగం సంతోష్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి కౌటిక్‌ రాజు, మధుకర్‌, రాజేష్‌, దిన్కర్‌ మోహన్‌ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ విజయవంతం

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌



పరీక్షల నిర్వహణ బాధ్యతల నుండి నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీని తప్పించి ఆయా రాష్ట్రాలకే పరీక్షల నిర్వహణ బాధ్యతలను అప్పచెప్పాలనే డిమాండ్‌తో ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన విద్యా సంస్థల బంద్‌ గురువారం కాగజ్‌నగర్‌లో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ ఎన్‌టీఏ ఈ విద్యాసంవత్సరం నిర్వహించిన యూజీసీ నెట్‌, నీట్‌ పరీక్షల పేపర్‌లు లీకయ్యాయని, ఇప్పటికే యుజీసీ నెట్‌ పరీక్షను రద్దు చేసినా ఇప్పటి వరకు నీట్‌ పరీక్షను మాత్రం ప్రభుత్వం రద్దు చేయలేదన్నారు. నీట్‌ పరీక్షను కూడా రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ పరీక్షల అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, కేంద్ర విద్యాశాఖా మంత్రి వెంటనే రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్‌, నాయకులు కార్తీక్‌, ప్రభాకర్‌, సంఘదీప్‌ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పసికందు మృతి

- అందోళన చేపట్టిన బాధిత కుటుంబసభ్యులు



రోడ్డుపై బైటాయించిన బాధిత కుటుంసభ్యులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌

కాగజ్‌నగర్‌ పట్టణంలోని ఒక ప్రయివేట్‌ ఆస్పత్రిలో గురువారం ఒక పసికందు మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం దహెగాం మండలం కల్వాడ గ్రామానికి చెందిన రమేష్‌-సవిత భార్యాభర్తలు. సవిత ఎనిమిది నెలల గర్భంతో మూడు రోజుల క్రితం కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్‌ ఆస్పత్రిలో చేరింది. ఈ నెల రెండో తేదీన వైద్యుడు ఆపరేషన్‌ చేయగా, సవిత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గురువారం ఉదయం పాప ఆకస్మాత్తుగా మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ పాప మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. స్థానిక ఎన్టీఆర్‌ చౌక్‌లో పాప మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. సీఐ శంకరయ్య ఎస్‌ఐ అంజన్నలు సంఘటనాస్థలానికి వచ్చి సముదాయించారు. ఫిర్యాదు చేస్తే వైద్యునిపై చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. గంట తర్వాత వారు ఆందోళన విరమించారు. దీనిపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-నార్నూర్‌

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా కలెక్టర్‌ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని జామడ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ముందుగా పాఠశాల పరిసరాలను తరగతి గదులను పరిశీలించారు. వర్షాకాలం వ్యాపిస్తున్న తరుణంలో ఎప్పటికప్పుడు పరిసరాలను గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆరో తరగతి నుంచి పదో తరగతి అన్ని గదులను తనిఖీ చేస్తూ విద్యార్థినులకు విషయాలపై ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులు జవాబులు ఇవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. అనంతరం కిచెన్‌ గార్డెన్‌ను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, పీడీ విశ్వనాథ్‌, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

రూ. 25 కోట్లు కేటాయించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌

కాగజ్‌నగర్‌ పట్టణాభివృద్ధికి రూ. 25 కోట్లు కేటాయించాలని కోరుతూ గురువారం మున్సిపల్‌ కౌన్సిల్‌ సభ్యులు మున్సిపల్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ దాన కిషోర్‌కు వినతిపత్రం ఇచ్చారు. హైదరాబాద్‌లో ప్రిన్సిపల్‌ సెక్రటరీ ఛాంబర్‌లో కలిసిన కౌన్సిలర్లు పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నాయకులు కోనేరు కృష్ణారావు, రావి శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు తాము ప్రిన్సిపల్‌ సెక్రటరీని కలిసినట్లు వారు వివరించారు. తమ వినతికి సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్‌ సెక్రటరీ ఇందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ మున్సిపల్‌ ఛైర్మన్‌ దస్తగిరితో పాటు పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

వేరుశనగ బస్తాల చోరీ.. ముగ్గురు అరెస్ట్‌



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్‌

పట్టణంలోని ఓ జిన్నింగ్‌ మిల్లులో వేరుశనగ బస్తాల చోరీ కేసును టూటౌన్‌ పోలీసులు ఛేదించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అశోక్‌ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా గత నెల స్థానిక శ్రీనాథ్‌ జిన్నింగ్‌ లో పది క్వింటాళ్ల పల్లీలు, రెండు మోటర్లు, వైర్‌లను నలుగురు దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వీరిలో ముగ్గురు దొంగలను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒకరు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 3 క్వింటాళ్ల పల్లీల బస్తాలు, రెండు మోటర్లు, ఒక బైక్‌ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. టూటౌన్‌ సీఐ ఆధ్వర్యంలో క్రైమ్‌ డిపార్ట్‌మెంట్‌ పోలీసులు రమేష్‌, నరేష్‌, క్రాంతి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్‌, నరేందర్‌ దొంగల్ని పట్టుకున్నారు.

పంచాయతీల్లో పైసల్లేవ్..!



- బ్లీచింగ్‌ పౌడర్‌..బల్బుల కొనుగోలుకు ఇబ్బందులు
- ట్రాక్టర్‌ కిస్తీలు కట్టలేక..డీజిల్‌ పోయలేక కష్టాలు
- వేతనాలు లేక పస్తులుంటున్న పారిశుధ్య కార్మికులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక తిప్పలు
- పరేషాన్‌లో గ్రామ పంచాయతీలు..అధికారులు

పైసలు లేక పంచాయతీలు పరేషాన్‌ అవుతున్నాయి..చిన్న పని తలపెట్టాలన్నా..చేతిలో చిల్లిగవ్వలేకుండా పోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతి నెల రావాల్సిన నిధులకు గ్రహణం పట్టుకుంది. గత ఆరు నెలల నుంచి నిధులు రాకపోవడంతో పల్లెల్లో రోజువారీ పనులు చేపట్టేందుకు ప్రత్యేక అధికారులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామాలకు కావాల్సిన కొన్ని సామన్లను అప్పురూపంలో తీసుకురాగా.. మరికొన్నింటికి సొంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటితో పాటు పంచాయతీల మీదనే ఆధాపడి బతుకుతున్న పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. తాజాగా వర్షాకాలం కావడంతో గ్రామాలను ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాల్సిన అవసరం ఉంది. కానీ ఆయా మౌళిక వసతులు కల్పించేందుకు సైతం డబ్బులు లేకపోవడంతో అభివృద్ధి పనులకు అవరోధం ఏర్పడుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్‌ ప్రాంతీయ ప్రతినిధి, తలమడుగు

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలంటారు. ప్రగతి బాటలో పయనించాల్సిన పల్లెలు నిధులు లేక నీరసించిపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు కొన్ని నెలలుగా ఆగిపోవడంతో నిధుల కటకటను ఎదుర్కొంటున్నాయి. ఒకటి, రెండు నెలలు రాకపోతే ఇబ్బందులు పడే పరిస్థితి ఉన్న ఈ రోజుల్లో..ఏకంగా ఆరు నెలలుగా నిధులు పత్తాలేకుండా పోయాయి. కేంద్రప్రభుత్వం నుంచి ప్రతినెలా రావాల్సిన 15ఆర్థిక సంఘం నిధులు గత ఆరు నెలల నుంచి జాడలేకుండా పోగా.. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఎస్‌ఎఫ్‌సీ నిధులు సైతం గత రెండేండ్ల నుంచి రావడం లేదు. దీంతో పల్లెల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోజువారీగా బ్లీచింగ్‌ పౌడర్‌, లైమ్‌తో పాటు స్ట్రీట్‌లైట్లు, దోమల నివారణకు ఉపయోగించే బయోలార్వా మందుల కొనుగోలుకు కూడా డబ్బులు లేని పరిస్థితి. వీటిని పంచాయతీ కార్యదర్శులు సంబంధిత ఏజెన్సీ నుంచి అప్పు(ఉద్దెర)గా తీసుకొస్తున్నారు. మరోపక్క ప్రతి నెలా రూ.60వేల వరకు కరెంటు బిల్లు వస్తుండటంతో ఈ బిల్లు చెల్లించేందుకు సైతం అవస్థలు పడాల్సివస్తోంది.

రోజువారీ పనులకు ఆటంకం..!

ఉమ్మడి జిల్లాలో 1512 గ్రామ పంచాయతీలు ఉండగా ఆదిలాబాద్‌ జిల్లాలో 468, మంచిర్యాలలో 311, నిర్మల్‌లో 398, కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి ప్రభుత్వం నుంచి గత ఆరు నెలల నుంచి నిధులు రాకపోవడంతో పెద్ద పంచాయతీలతో చిన్న పల్లెలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పెద్ద పంచాయతీల్లో జనాభా ప్రకారం కొంత ఎక్కువ మొత్తంలో నిధులతో ఎలాగోలా నెట్టుకొస్తుండగా.. చిన్న పంచాయతీల్లో తక్కువగా నిధులు రావడం..కొన్ని రోజులకే ఖర్చయిపోతుండటంతో మరింత కటకట ఏర్పడుతోంది. ఇంటింటి చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్‌లో డీజిల్‌ కూడా పోయించలేని పరిస్థితి. మరోపక్క ప్రతినెలా సుమారు రూ.12వేల వరకు కిస్తీలు చెల్లించలేక తీవ్రంగా ఇబ్బందులు పడాల్సివస్తోందని కొందరు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క గ్రామాల్లో ఇంటింటికి నీటిని సరఫరా చేసే సబ్‌మెర్సిబుల్‌ పంపులు సైతం మరమ్మతులకు గురికావడంతో వాటిని బాగు చేయించడానికి కూడా తిప్పలు తప్పడం లేదని తెలుస్తోంది. ఇక పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు నియమించిన పారిశుధ్య కార్మికులు గతంలో ఎన్నడూలేనివిధంగా ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఏకంగా ఆరు నెలల నుంచి వారికి వేతనాలు లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. అప్పులు చేసి కిరాణ సరకులు తెచ్చుకుంటున్నారు. కొందరైతే మూడు పూటలు తినలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టిసారించాలి

గత రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి పేరిట గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టింది. ప్రతి నెలా నిధులు విడుదల చేస్తూ రోడ్లు బాగుచేయడం, ఇంటింటి చెత్త సేకరణ, డంపింగ్‌యార్డులు, స్మశానవాటికలు తదితర వాటిని నిర్మించడమే కాకుండా రోజువారీగా కార్యకలాపాలు చేపట్టేలా పారిశుధ్య కార్మికులను నియమించింది. ఇందుకు సంబంధించి ప్రతి నెలా నిధులు విడుదల చేసేది. కేంద్రం నుంచి సైతం 15ఆర్థిక సంఘం నిధులు సకాలంలో వచ్చేవి. దీంతో పల్లెల్లో మౌళిక వసతుల కల్పనకు ఆస్కారం ఏర్పడింది. కానీ గత ఆరు నెలలుగా రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ఏర్పడటం.. తొలుత అసెంబ్లీ ఎన్నికలు రావడం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరడం.. వెంటనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో పల్లెల్లో నిధుల లేమి సమస్య ఏర్పడింది. తాజాగా ఎన్నికల ప్రక్రియ ముగిసిపోవడంతో కాంగ్రెస్‌ ప్రభుత్వం పాలనపై పూర్తిస్థాయిలో దృష్టికేంద్రీకరించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో మాదిరిగానే పల్లెలకు ప్రతినెలా నిధులు విడుదల చేసి అభివృద్ధి బాటలో పయనించేలా చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

సద్ది మూట ఇచ్చేందుకు వెళ్లి..మృత్యుఒడిలోకి

- తల్లి ప్రేమకు దూరమైన చిన్నారులు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- సుర్దపూర్‌లో విషాద ఛాయలు



నవతెలంగాణ-కెరమెరి

భర్తకు సద్ది అన్నం ఇవ్వడానికి వెళ్లిన వివాహిత మృత్యు ఒడిలోకి వెళ్లిన సంఘటన గురువారం సుర్దపూర్‌ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లీంగూడ గ్రామానికి చెందిన జ్యోతికి సుర్దపూర్‌కు చెందిన చౌదరి సురేందర్‌తో 2020లో విహహం జరిగింది. ఈ దంపతులకు శ్రీవల్లి(3) శ్రీకన్య(6 నెలలు) పిల్లలున్నారు. సురేందర్‌ ఉదయాన్నే గ్రామ సమీపంలోని వాగు అవతల వైపున ఉన్నా చేను పనులకు వెళ్ళాడు. సద్ది అన్నం భర్తకు ఇచ్చి తిరిగి వస్తానని చెప్పి ఇద్దరు చిన్నారులను పక్కింటి ఆవిడకు ఇచ్చి 10 గంటల ప్రాంతంలో సద్ది అన్నం తీసుకుని చెనుకు బయలుదేరింది. ఓ చేత్‌తో సద్ది అన్నం మరో చేత్తో నీళ్ల క్యాన్‌ చేతపట్టుకొని వాగు దాటే క్రమంలో లోతుగా ఉన్న నీటిలోకి అడుగేయడంతో నీటిలోకి మునిగిపోయింది. ఈత రాకపోవడంతో లోతుగా ఉన్న నీటిలోకి వెళ్ళడంతో నీట మునిగింది. గమనించిన మేకల కాపరి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామంలోని యువకులు వాగు వద్దకు చేరుకొనేలోపు మరణించింది. ఘటన స్థలానికి ఎస్సై విజయ్‌ కుమార్‌ వివరాలు సేకరించారు. తల్లి మృతి చెందిన విషయం తెలియక రోధిస్తున్న చిన్నారుల తీరు కలచివేసింది. అందరితో కలివిడిగా ఉండే జ్యోతి మరణించడంతో లీంగూడ, సుర్ధపూర్‌ గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్వామి వివేకానంద బోధనలు ఆదర్శం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌ రూరల్‌

స్వామి వివేకానంద బోధనలు ఆదర్శమని తెలంగాణ కిసాన్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్‌ పట్టణంలోని వివేకానంద చౌరస్తాలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్‌ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని జాగృతము చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయము చేసిన ఖ్యాతి స్వామి వివేకానంద దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్‌, కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షులు తడ్పేన వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, దామోదర్‌రెడ్డి, నలిమేల నవీన్‌రెడ్డి, గణపతిరెడ్డి, కుదురుపాక సురేష్‌, మల్లయ్య, వెంకటేష్‌, గాలిపెల్లి నాగన్న, రంజిత్‌రెడ్డి, గౌతమ్‌, శ్రీను, ఫెరోజ్‌ ఖాన్‌ పాల్గొన్నారు.

కొమురయ్య స్ఫూర్తితో పోడుభూముల రక్షణ కోసం ఉద్యమిద్దాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్‌
- పార్టీ ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతి
- మెస్రం మనోహర్‌కు నివాళ్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్‌

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోడుభూముల రక్షణ కోసం ఉద్యమిద్దామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్‌ అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మెస్రం మనోహర్‌ రెండవ వర్ధంతిని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సుందరయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇద్దరి చిత్రపటాలకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్‌ నాయకులు బండి దత్తాత్రిలు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్‌ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట మొట్టమొదటి అమర వీరుడు దొడ్డి కొమురయ్య అన్నారు. 1946 జూలై 4న విస్నూర్‌ రామచంద్రారెడ్డి గుండాల కాల్పుల్లో మరణించారని ఆయన మరణాన్ని స్ఫూర్తిగా తీసుకోని రెట్టింపు ఉత్సాహంతో తెలంగాణ ప్రజలు ఎర్రజెండా నాయకత్వాన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. ఫలితంగా నిజాం ప్రభుత్వం కుప్పకూలడం తెలంగాణ విముక్తి కావడం జరిగిందన్నారు. లక్షలాది ఎకరాల భూమిని పంచి, వెట్టి చాకిరీని తుదముట్టించిన పోరాటంగా తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు.

చిన్నవయసులోనే అసువులు బాసాడు..

దివంగత మెస్రం మనోహర్‌ చిన్న వయస్సులోనే సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడిగా, తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా ఎదిగారన్నారు. పోడు భూములకు హక్కు పత్రాల కోసం, ఆదివాసుల హక్కులకోసం ఉద్యమించాడని గుర్తు చేశారు. అనారోగ్యంతో అసువులు బాశారని, దొడ్డి కొమురయ్య, మెస్రం మనోహర్‌ల ఆశయం పేదవారికి భూమి దక్కాలి, వెట్టి చాకిరీ విముక్తి కావాలని పోడు భూములకు పట్టాలు రావాలన్నదే వారి ఆశయం అందుకోసం సీపీఐ(ఎం) నాయకులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు అర్‌.మంజుల, నాయకులు ఎస్‌.స్వామి, కె.ఆశన్న, లంక జమున, కోవే శకుంతల, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, పార్టీ భీంపూర్‌ మండల కన్వీనర్‌ ధొనిపెల్లి స్వామి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కో కన్వీనర్‌ కొట్నాక్‌ సక్కు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్‌) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో...

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అమరత్వ స్ఫూర్తితో మోడీ ఫాసిస్టు, శక్తులను ఓడించాలని సీపీఐ(ఎంఎల్‌) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట నారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రజి హరీశ్‌, మడావి గణేష్‌, ఉపాధ్యక్షులు దీపలక్ష్మి, సహాయ కార్యదర్శి దత్తు, పూజ, అజయ్‌, అర్జున్‌, శ్రీకర్‌, పీవైఎల్‌ నాయకులు మెస్రం మారుతి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌

దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్‌ను పెంచాలని డిమాండ్‌ చేస్తూ శుక్రవారం ఆసిఫాబాద్‌ జిల్లా కలెక్టరేట్‌ ముందు ధర్నా చేపడుతున్నట్లు చైతన్య దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండి ఖయ్యూం తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్‌ మొత్తాన్ని పెంచుతామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ హామీ ఇచ్చిందని, ఈ హామీ మేరకు పెన్షన్‌ పెంచాలని, ప్రతీ దివ్యాంగునికి ఉచిత బస్‌ పాస్‌ సౌకర్యం కల్పించాలని, ప్రతీ నెలా ఒకటో తేదీనే పెన్షన్‌ చెల్లించాలని, రిజర్వేషన్‌ ఐదు శాతం పెంచాలనే తదితర డిమాండ్లతో ఈ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు బి మూర్తి, పొన్నాల రమాకాంత్‌, గుల్‌జార్‌ మహ్మద్‌, ఎండి ఖలీల్‌ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జులై 05, 2024 | www.navatelangana.com

పాఠశాలల సందర్శన

నవతెలంగాణ-పెంబి



రూం టు రీడ్ తెలంగాణ స్టేట్ మేనేజర్ కె.నరసింహాచారి గురువారం రాముగూడ, కొలాంగూడ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పెంబి ప్రాథమిక పాశాలలోని గ్రంథాలయానికి వేస్తున్న రంగులను పరిశీలించారు. ఇతర విద్యా సామాగ్రిని ఎలా ఉపయోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల అభ్యసన ఫలితాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల, అధికారుల కృషిని అభినందించారు. ఆయన వెంట మండల నోడల్ అధికారి కాంప్లెక్స్ ప్రాధానోపాధ్యాయులు హెడ్ మాస్టర్ రామచందర్, సమగ్ర శిక్షా క్లస్టర్ రిసోర్స్ పర్సన్ విఠల్, రూమ్ టు రీడ్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు నితిన్, ప్రవీణ్, జిల్లా ఇన్‌చార్జీ గోనె రవి, బ్లాక్ కోఆర్డినేటర్ రాజేందర్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా ఆర్డీఓ వినోద్ కుమార్

నవతెలంగాణ-సిరికొండ



సిరికొండ మండల ప్రత్యేకాధికారిగా ఆదిలాబాద్ ఆర్డీఓ వినోద్ కుమార్ గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ బాలగంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విలాస్, మండల సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నీట్ పరీక్షలపై సమగ్ర విచారణ జరిపించాలనే డిమాండ్ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపు విజయవంతమైంది. ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలలు ముందుగానే సెలవు ప్రకటించాయి. గురువారం అక్కడక్కడ తెరిచి ఉన్న పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించి, విద్యార్థులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ నీట్ నిర్వహించిన ఎన్టీఏ సంస్థ అవకతవకలకు పాల్పడటంతో విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఘటన జరిగి 21 రోజులు అవుతున్న ఇప్పటివరకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థుల ప్రాణాలతో కేంద్రం చలగటం ఆడిందని ఆరోపించారు. ఎన్టీఏను రద్దు చేయడంతో పాటు చైర్మెన్, కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని, తిరిగి నీట్‌ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు గణేష్, శాంతన్‌రావు, మెస్రం భాస్కర్, కేశవ్, అశోక్ ఉన్నారు.

సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేయాలి

- జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-నార్నూర్

అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నీతి అయోగ్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, జిల్లా వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వాస్పత్రి నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ఆశాలు అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్, మహిళ కమిషన్ సభ్యురాలు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో అత్యవసర సమయంలో గర్భిణులు, బాలింతలు ఆస్పత్రులకు వెళ్లాలంటే అనేక అవస్థలకు గురవుతున్నారని రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వం హయంలో గంగాపూర్ నుంచి మాహాగావ్, నార్నూర్ నుంచి నాగల్‌కొండ, ఏంపల్లి తదితర గ్రామాలకు మంజూరైన రోడ్డును అతి త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. వర్షాకాలంలో వైరల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి మలేరియా, డెంగ్యూ సోకకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనం నిర్మించాలన్నారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ కనక మోతుబాయి, వివిధ గ్రామాల ఎంపీటీసీలను సన్మానించారు. వ్యవసాయం సేంద్రీయ ఎరువులు వాడకం, అంగన్‌వాడీలు, ఐకేపీ సంఘాల ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, ఐటీడీఏ ఏపీఓ మనోహర్, డీఆర్డీఓ సాయన్న, ఏడీఏ పుల్లయ్య, ఏజెన్సీ డీఎంహెచ్ఓ మనోహర్, ఎంపీపీ కనక మోతు బాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, కో ఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఎంపీడీఓ జవహర్ లాల్, మండల వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం



నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న గిరిజన, గిరిజనేతర రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో తరతరాలుగా కాస్తూ చేస్తున్న రైతులు తమకు ఉన్న వివిధ భూసమస్యలు, బ్యాంక్ రుణాలు, పహానీలు రాకతో పడిన ఇబ్బందులను ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రైతు భరోసాపై అభిప్రాయాలను తీసుకొని తీర్మానించారు. రైతుల తీర్మానాలను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, మాజీ జెడ్పీటీసీ బ్రీజులాల్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, సీఈఓ గణేష్ ఆడే, ఏఈఓ రాజేశ్వర్, సహకార సంఘ సభ్యులు, అధికారులు, రైతులు ఉన్నారు.

డబుల్ రోడ్డు నిర్మించాలి



నవతెలంగాణ-నార్నూర్

నార్నూర్ నుంచి గాదిగూడ వరకు డబుల్ రోడ్డును నిర్మించాలని తుడుం దెబ్బ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోనీ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సంపూర్ణత అభియాన్ ప్రారంభ కార్యక్రమంలో హాజరైన కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి సరిగా లేకపోవడంతో గర్భిణీ మహిళలు గాదిగూడ నుంచి నార్నూర్ ప్రభుత్వాస్పత్రికి వారానికి ఒక సారి వైద్యం నిమిత్తం పీహెచ్‌సీ రావాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న నీటి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో తుడుందెబ్బ మండల అధ్యక్షులు అడ శ్రీరామ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావ్, తుడుందెబ్బ జిల్లా సలహాదారుడు తొడసం నాగోరావ్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు మెస్రం మానిక్‌రావ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పూసం ఇస్రు, నాయకులు ఎత్మారాం, మెస్రం చందు ఉన్నారు.

భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గత ఐదు సంవత్సరాలుగా తమను ఎన్నుకున్న ప్రజల కోసం ప్రజా క్షేత్రంలో అహర్నిశలు పాటుపడి అన్ని విధాల ప్రజలకు అండగా నిలిచారని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మావల మండల ఎంపీపీ దర్శనాల సంగీత, వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రహీమ్‌ఖాన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేండ్లు ప్రజలకోసం అహర్నిశలు పాటుపడిన ప్రజా ప్రతినిధుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. వారు భవిష్యత్తులో మరిన్ని పదవులను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తడ్సేన వెంకట్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, దామోదర్ రెడ్డి,



నలిమేల నవీన్ రెడ్డి, గణపతిరెడ్డి, కుదురుపాక సురేష్, మల్లయ్య, వెంకటేష్, గాలిపెల్లి నాగన్న, రంజిత్‌రెడ్డి, గౌతమ్, శ్రీను, ఫెరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-సారంగాపూర్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చించోలి(బి) గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. చించోలి(బి) గ్రామానికి చెందిన కొత్తపాటి రాజు(38) మద్యానికి బానిసై మద్యం మత్తులో బుధవారం రాత్రి ఇంట్లో దూలాని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భూస్వామ్య విధానాన్ని నిర్మూలించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దొడ్డి కొమరయ్య పోరాటా స్ఫూర్తితో పెట్టుబడిదారీ భూస్వామ్య విధానాన్ని నిర్మూలించాలని సీపీఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్ సింగ్ అన్నారు. గురువారం ఆయన 78వ వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలోని కుమురం భీం భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగన్‌సింగ్ మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ ప్రాంతంలో భూమి నైజామ్, దొరలు, దేశ్‌ముఖ్‌ల చేతిలో అక్రమంగా పోగుబడి ఉందని, ప్రజలకు దున్నుకోవడానికి చేరడు నేల కూడలేదని, భూమిపై హక్కు కోసం పోరాడితే దొడ్డికొమురయ్య కాల్చి చంపారని అన్నారు. నేడు దేశంలో పెట్టుబడిదారీ భూస్వామ్య విధానం కొనసాగుతుందని, సామ్రాజ్యవాదులతో జూనియర్ భాగస్వామిగా చేరారని, భారతదేశంలో సోషలిజాన్ని స్థాపించడానికి కార్మికవర్గ నాయకత్వంలో ప్రజా వెల్లువలు సృష్టించాలని అన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా భారత దేశానికి విముక్తి లభిస్తుందని పిలుపునిచ్చారు. నేడు దేశంలో నరేంద్రమోడీ పాలనలో పెట్టుబడిదారీ వర్గాలకు దేశ సంపదను దోచి పెడుతూ, పేదవర్గాలను హక్కుల అడిగినందుకు అణచి వేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం వినోద్ కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అజ్మీర వినోద్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీడం సాయికుమార్, కొమ్ర అశోక్, ఏఐపీకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కొడప సురేష్, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి మడవి రేణుక, నాయకులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి 8మంది విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-బోథ్

ట్రిపుల్ ఐటీకి బోథ్ ఆదర్శ పాఠశాలలో చదివిన 8మంది విద్యార్థుల ఎంపికయ్యారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నందిని, తేజస్విని, బి.సాయి, ఆర్.దుర్గాదాస్, ఏం.శ్రావణి, ఎ.మనోజ్, ఎండీ రయాన్, సీహెచ్.గణేష్ ఎంపికైనట్లు తెలిపారు. తమ పాఠశాల నుంచి 8 మంది ఎంపిక కావడంతో విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ ఉట్నూర్‌లో ఆగస్టు 2024 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోరకు వెబ్సైట్ ఐటీఐ.తెలంగాణ.గావ్.ఇన్ ఆన్‌లైన్‌లో దరాఖాస్తులు 04 జూలై నుంచి 15 జూలై వరకు పొడగించడం జరిగిందని, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే.రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10/8 తరగతి పాస్ అయి ఉండాలని 01ఆగస్టు 2024 వరకు 14 సంవత్సరాలు నిండి ఉండాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి పెంబి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-పెంబి

బాసర ట్రిపుల్ ఐటీకి పెంబి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ఐదు గురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంచందర్ తెలిపారు. గురువారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులు సుమతి, జోగు షాలిని, శివాణి, అర్చన, శ్రీలతలను గ్రామస్తులు అభినందించారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు స్వప్నిల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తులాల శంకర్, గాండ్ల శంకర్, మతీన్, బింగి రవి, జోగు రమేష్, కసీం, పెండల నరేష్, తులాల వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల సాగు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-బోథ్

పంటల సాగు విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండలంలోని పాట్నాపూర్ గ్రామానికి చెందిన గిరిజన రైతులు గురువారం ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాకు వినతిపత్రం అందజేశారు. రైతుల పొలాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కష్టంగా మారిందని పేర్కొన్నారు. తమకు ఐటీడీఏ ద్వారా విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. స్పందించిన ఐటీడీఏ పీఓ సానుకూలంగా స్పందించి, తప్పకుండా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, రైతులు సిడం రాంపల్కు, కుమురం కిషన్, ఆత్రం నాగోరావ్, భీంరావ్, పొల్లు మారన్న, తొడసం కృష్ణ సాయి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-బేల

బేల పోలీస్ స్టేషన్‌ని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి స్థానిక ఎస్సై రాధికాతో పాటు సీఐ, డీఎస్పీ ఘన స్వాగతం పలికారు. మండల పోలీసుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మొక్కలు నాటారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో ప్రతి రోజు ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయని ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని అన్నారు. వచ్చిన ఫిర్యాదుపై వెంటనే బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్టేషన్ పరంగా పోలీస్ సిబ్బందికి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డితో పాటు సీఐ సాయినాథ్, ఎస్సై రాధిక, పోలీసులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి మైనార్టీ నాయకులు సన్మానం



నవతెలంగాణ-సారంగాపూర్

జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఐదేండ్లు పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల మైనారిటీ కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె సలీమ్ శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పదవీ విరమణ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్, మాజీ అడెల్లి ఆలయ చైర్మెన్ ఉట్ల రాజేశ్వర్‌లు ఉన్నారు.

నారాయణరావు పటేల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-కుభీర్

ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్‌ను గురువారం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో మండలంలో ఉన్న మస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దేవేందర్, హనుమండ్లు, రమేష్, నాయకులు బషీర్, దిగంబర్ పటేల్ ఉన్నారు.

అంతర్జాతీయ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, మహాత్మా జ్యోతిబాపులే, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను కళాశాలల ప్రిన్సిపల్స్ డా.అచ్చి శ్రీనివాస్, డా.జలగం అనితతో సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత జనవరి నెలలో సిద్దిపేటలో జరిగిన జాతీయ స్థాయి టార్గెట్ పోటీలలో పాల్గొని విజయం సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. జులై 9 నుంచి 12 వరకు నేపాల్ రాష్ట్రంలో జరిగే అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలలో ఆర్ట్స్ విద్యార్థిని గౌరీ, సైన్స్ విద్యార్థి వంశీ, జ్యోతిబాపూలే విద్యార్థిని సాత్విక పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించాలన్నారు. ఈ పోటీల్లో రాణించి దేశంతో పాటు జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావ్, సైన్స్ పీడీ అనిత, అధ్యాపకులు జగ్రామ్, శ్రీనివాస్, నర్సింగరావు, సంతోష్, తిరుపతి, చంద్రకాంత్, రఘునాథ్, దయాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

బొంతల ముచ్చట్లు పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన శ్రీధర్‌రావు దేశ్‌పాండే బోథ్ ప్రాంత భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థికఅంశాలు, ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలతో పాటు బాల్య జీవిత విశేషాలతో బొంతల ముచ్చట్లు అనే పుస్తకాన్ని రచించారు. బోథ్ ప్రభుత్వ పాఠశాలలో తన చిన్ననాటి గురువులు అంబాదాస్, నందయ్య, దేవన్న, మిత్రులు, 1978 పదో తరగతి బ్యాచ్ మిత్రులు రమేష్‌బాబు, నర్సయ్య, సదానందం, అరవింద్, రావుల శంకర్, మురళీ, ముస్తాప, సురేష్ వైద్య, భాస్కర్ తదితరుల సమక్షంలో మండలంలోని పెద్దవాగు వద్ద బొంతల ముచ్చట్లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ ప్రాంత సమున్నత సాంస్కృతిక వారసత్వాన్ని, బోథ్ ప్రాంత సౌందర్య భరితమైన పరిసరాలను, కొండలు, చెట్లు, గుట్టలు, సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతాలు, ఈ ప్రాంత ప్రజల జీవన స్థితి గతులు, ఆచార వ్యవహారాలను భావి తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో తన అనుభవాలను రంగరించి ఈ పుస్తకాన్ని రాశానని అన్నారు. పుస్తక రచయిత తానే అయినప్పటికీ ఇది సమిష్టి అనుభవాలకు అక్షర రూపమని అన్నారు. పుస్తక రచన సమయంలో సమాచారాన్ని, ఫోటోలను అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. బోథ్ ప్రాంత విశేషాలు ఇంకా చాలా ఉన్నాయని, రానున్న రోజుల్లో మరో పుస్తక రూపంలో అందివ్వడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తన స్నేహితులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-నేరడిగొండ



మహిళా సమైక్య సంఘాలను కోటీశ్వరులుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మహిళ సంఘం సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కుమారి గ్రామ సరస్వతి గ్రామైక్య సంఘం, ఆదిలక్ష్మి సంఘం 2002 నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు 12 లక్షల 50 వేల రుణాన్ని తీసుకోగా, సరస్వతి అను సభ్యురాలు 2002 నుంచి ఇప్పటివరకు సంఘం కోసం పని చేస్తూ, గురువారం రిటైర్‌మెంట్ తీసుకోవడంతో సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీలు లింగారాజ్, వీఓఏ లస్మన్న, గ్రామైక్య మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చుక్కల దుప్పిపై దాడి చేసిన కుక్కలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని చిట్యాల గ్రామ సమీపంలో ఉన్న అడవిలో గురువారం కుక్కలు చుక్కల దుప్పిపై దాడి చేశాయి. గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని దుప్పికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం గంగాపూర్ అడవుల్లో వదిలిపెట్టినట్టు ఎఫ్ఆర్ఓ అనిత తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | జులై 05, 2024 | www.navatelangana.com

బస్టాండ్ నిర్మించాలని వినతి



నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గందె వెంకటేష్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం నుండి వందలాది మంది ప్రయాణికులు కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి తదితర పట్టణాలకు తరలి వెళ్తున్నారన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని కోరారు. బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని డీఎం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంపాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ జాజిమొగ్గ సుజాత ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీఓ గంగాసింగ్, ఎంపీపీ సుజాత, జడ్పీటీసీ సముద్రాల సరిత, కో ఆప్షన్ సభ్యులు సాజిత్, ఎంపీటీసీలను పూల మాలలు శాలువాలతో సత్కరించారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చౌదర్ తిరుపతి, జాజిమొగ్గ శ్రీనివాస్, సముద్రాల రాజన్న, చౌదరి బండు పాల్గొన్నారు.

దుర్భాషలాడటంపై బహిరంగ చర్చకు సిద్ధం

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మంత్రి పర్యటనలో బీఆర్ఎస్ నాయకులపై తాను దుర్భాషలాడినట్లు ఎమ్మెల్యే చేస్తున్న అసంబద్ధ వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెబ్బెన పర్యటనలో తాను దూషించినట్లు ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. 10 సంవత్సరాల్లో తాము చేసిన శంకుస్థాపనలు కూడా బీఆర్ఎస్ పూర్తి చేయలేదన్నారు. ఆదివాసులను ఎప్పుడు గౌరవిస్తామని దీనికి నిదర్శనమే మంత్రి సీతక్క మూడు పర్యటనల్లో మొదటిది హైమన్ డార్ఫ్, జెట్టి విగ్రహాల సందర్శన, రెండో పర్యటనలో జంగుబాయి, మూడో పర్యటంలో జోడేఘాట్ తీసుకువెళ్లామన్నారు. మంత్రి పర్యటనలో మారుమూల గ్రామమైన సవాతికీ తీసుకువెళ్లి రాయి సెంటర్‌లో సమావేశం పెట్టామన్నారు. తాను చేసిన కాంట్రాక్టు పనులు తన వృత్తిరీత్యా చేసినవని వాటిలో ఎటువంటి అవినీతి ఉన్న విచారణ జరిపించుకోవచ్చని అన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యే అయి ఉండి ఆదివాసీ మంత్రి జిల్లాకు వస్తే ఎలా వస్తారని హెచ్చరించడం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడమే అన్నారు. పదేపదే ఆదివాసీ మహిళ అని చెబుతున్న ఎమ్మెల్యే గతంలో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిని ఎలా ఇబ్బందులతో గురి చేసిందో మరిచిపోయారా అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లా పర్యటనకు మంత్రులు వచ్చిన నేపథ్యంలో జిల్లాలో ఆ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు పెట్టడంతో పాటు, కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి వేరువేరు పోలీస్ స్టేషన్లలో ఉంచేవారని గుర్తు చేశారు. రెబ్బెన మండలం నవేగాంలో గతంలో తమ హయాంలోనే అభివృద్ధి జరిగిందని 10 సంవత్సరాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని దీని దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులు మంత్రికి స్వాగతం పలకడాన్ని జీర్ణించుకోలేక అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారని ఆరోపించారు. అసభ్య పదజాలంతో దూషించడం తనకు అలవాటు లేదని ఒకవేళ అలా తాను చేసినట్లయితే బహిరంగ చర్చకు సిద్ధమని, వీడియోలు విడుదల చేయాలని సవాల్ చేశారు. ఎమ్మెల్యే రక్షణ కాంగ్రెస్ బాధ్యత అని అయితే రాష్ట్రవ్యాప్తంగా ఎస్కార్ట్ విషయంలో అమలు అవుతున్న నిబంధనలు ఆసిఫాబాద్‌లో కూడా అమలవుతున్నాయన్నారు. అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్ గౌడ్, అనిల్ గౌడ్, వసంతరావు, మల్లేష్, శ్యామ్, ఆసిఫ్, కళావతి, మునీర్, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా నామినేషన్ కింద సింగరేణికి ఇవ్వాలనే డిమాండ్‌తో సీపీఐ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ తెలిపారు. గురువారం అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను ప్రభుత్వ రంగ సంస్థలకు ఇవ్వకుండా వేలం ద్వారా ప్రయివేటు వారికి ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్ర పిలుపు మేరకు జులై 5న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, 8 నుంచి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టడం జరుగుతుందని, 10న జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద ధర్నా, 17న హైదరాబాద్‌లో వేలం వేసే ఆఫీసు ముందు ధర్నా చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఆందోళన కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలు సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమరం తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రాయిల్లా నర్సయ్య, నాయకులు రమేష్, సురేష్, మోర్ల శ్యామ్ రావు, తోట రాంచందర్, శ్యామల పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని కృష్ణ పల్లి గ్రామానికి చెందిన నాయిని గంగయ్య (65) గురువారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బెజ్జూర్ ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక విచారణ తెలిసిందని ఎస్సై అన్నారు. మృతుడి భార్య విమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

నేడు వారసంత వేలం పాట

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారసంత సోమవారం జరిగిన వారసంత వేలం పాట అనివర్యాల కారణాలవల్ల వాయిదా పడింది. తిరిగి శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎంపీడీఓ కోట ప్రసాద్ అధ్యక్షతన వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆసిఫ్ అలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలం పాటలో రూ.పదివేల డిపాజిట్ చేసి పాల్గొనాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-రెబ్బెన

మండలం గంగాపూర్ గ్రామంలో అని శెట్టి మహేష్ ఇంట్లో అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గంగాపూర్ గ్రామంలో అక్రమంగా తరలించడానికి రేషన్ బియ్యం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి సోదాలు నిర్వహించారు. ఇక్కడ 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు పేర్కొన్నారు. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కొత్త న్యాయ చట్టం భారత్ న్యాయ సంహిత చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- జిల్లా కేంద్రంలో రాస్తారోకో



ఆసిఫాబాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నీట్ పరీక్షలు రద్దు చేయాలని ఎస్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, పిడిఎస్‌యూ, ఏఐవైఎఫ్‌తో పాటు వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లావ్యాప్తంగా విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ విద్యాసంస్థలు ఒకరోజు ముందుగానే తమ పాఠశాలలకు సెలవు ప్రకటించగా రోజువారీగా ప్రభుత్వ విద్యా సంస్థలు తెరుచుకున్నాయి. విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి వచ్చిన విద్యార్థులను ఇంటికి పంపించి వేసి సంస్థలు మూసివేయించారు. విద్యార్థులతో కలిసి జిల్లా కేంద్రంలోని సబ్ జైలు ఎదుట ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి, బీసీ సంఘం నాయకుడు ప్రణయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అయూబ్ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులతో చెలగాటం ఆడుతున్న ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్షలు తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీటి పరీక్ష పత్రాన్ని రూ.30 నుండి 32 లక్షలకు అమ్ముకున్నట్లు రుజువైనప్పటికీ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రధాని పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేశారు. 20 లక్షల మంది విద్యార్థులకు నష్టం జరుగుతుంటే కనీసం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం తన తప్పును దిద్దుకోకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నీట్ పరీక్ష లీకేజీకి సంబంధించి బాధ్యత వహిస్తు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కౌటాల : నీట్ అవకతవకలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన విద్యాసంస్థల బంద్ మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సాయినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలు సంపూర్ణంగా బంద్ పాటించాయన్నారు. ఎన్టిఏను రద్దు చేయాలని, నీట్, యూజీసీ-నెట్ సిఎస్ఐఆర్ కంబైన్డ్ నెట్ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సాయినాథ్, మండల నాయకులు శశి, ఉమేష్, సతీష్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా మెడికల్ విద్యార్థులకు నిర్వహించే ప్రవేశ పరీక్షలలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ చేపట్టిన విద్యాసంస్థల బంద్ మండలంలో విజయవంతం అయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ నితీష్ తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు కానుగుల సాయికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



చింతలమానేపల్లి



కౌటాల

సింగరేణికే బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలి

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి

నవతెలంగాణ-రెబ్బెన



సింగరేణి సంస్థను కార్పొరేట్‌కు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి సింగరేణి నర్సరీ కార్మికులు బొగ్గు బ్లాక్‌లను కార్పొరేట్ సంస్థలకు అప్పగించొద్దని నిరసన తెలిపారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రకృతి సంపద, ప్రజల ఆస్తి అయిన బొగ్గు బ్లాక్‌లను వేలంపాట ద్వారా ప్రయివేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించన్నారు. దీనిలో భాగంగా మంచిర్యాల జిల్లాలో శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కూడా వేలం పాటలో పెట్టారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటీకరణ చేసే తప్పుడు నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోలేటి నర్సరీ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) బెల్లంపల్లి ఏరియా అధ్యక్షురాలు దుర్గం చిన్నుబాయి, ఉపాధ్యక్షురాలు ఆర్.శారద, వి.వనితా పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సమన్వయంతో కృషి చేసి పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ లక్ష్యాల సాధన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీతి ఆయోగ్‌లో భాగంగా వెనుకబడిన ప్రాంతాలలో ఆరోగ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, మహిళలు, శిశువుల సంక్షేమం సంబంధిత అంశాలపై సంపూర్ణత అభియాన్ ద్వారా ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాను సంపూర్ణత అభియాన్ ద్వారా ప్రథమ స్థానంలో ఉంచేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పని చేస్తూ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గర్భం దాల్చిన మహిళలు తమ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో వివరాలు నమోదు చేసుకుని ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు, పౌష్టిక ఆహారం, మందులు సకాలంలో తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు ప్రజలకు వివరించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పోషక విలువలు కలిగిన ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని, గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు తెలియజేయాలన్నారు. ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలోని మట్టిని భూసార పరీక్షలు చేయించుకొని కార్డులను పొందాలని, పరీక్ష నివేదిక ఆధారంగా సాగు చేయాల్సిన పంటలపై రైతులకు మెలకువలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సంవత్సరంలోపు వయసు గల పిల్లలందరికీ 100 శాతం టీకాలు అందించాలని సూచించారు. సెప్టెంబర్ 30 వరకు క్షేత్రస్థాయిలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, నిర్దేశిత అంశాలపై అధికారులు సమిష్టిగా పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి, విద్య, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వైద్య శిబిరంలో స్వయంగా బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం, జడ్పీటీసీలు నాగేశ్వర్ రావు, శ్రీరామరావు, సంతోష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, ఏపీడీ రామకృష్ణ, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జీని విమర్శిస్తే ఊరుకునేది లేదు

నవతెలంగాణ-చింతలమానేపల్లి



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని, అనవసరంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని కాగాజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య అన్నారు. మండల కేంద్రంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్లు ప్రాజెక్టుల మీద మాట్లాడారని, అవి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రారంభమైనట్లు తెలిపారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులకు పుష్కలంగా నీళ్లు వచ్చి రెండు పంటలు పండిస్తూ రైతుల కుటుంబంలో ఆనందం నింపారన్నారు. సస్య శ్యామలంగా ఉన్న ప్రాంతాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడక ఎడారిగా మారిందన్నారు. పదేండ్లు పరిపాలించిన కేసీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఎందుకు పట్టించుకోలేదో తెలుసుకోవాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్‌కి పోలీస్‌లు సెల్యూట్ కొడితే అతని ఎమ్మెల్యేనా ఎంపీనా అనడం సరికాదన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ సిర్పూర్ ప్రెసిడెంట్, మార్కెట్ కమిటీ డైరెక్ట్ సంతోష్, సహకార సొసైటీ సంఘం డైరెక్టర్ ఎర్రలో ఎల్లయ్య, కర్జెల్లి మాజీ ఉపసర్పంచ్ రౌతు శంకర్, తలోడి మాజీ సర్పంచ్ ఆత్రం సత్యయ, కాంగ్రెస్ మండల జనరల్ సెక్రటరీ కొండు శంకర్, మండల యూత్ అధ్యకులు లాట్కరి మహేష్, నాయకులు గొగుర్ల పోచయ్య, నందిపేట రామయ్యా, పాలే సత్యం శంకర్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాల సాధన దిశగా సాగాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాల సాధన దిశగా అందరం కలిసి పాటుపడదామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధుడిగా దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరికి గురవుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విముక్తికి పోరాడారన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, వారి ఆశయాల సాధనకు అందరం కలిసి సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా అధికారులు, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, యాదవ సంఘం నాయకులు మల్లికార్జున్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జీవరాశి మనుగడకు ప్రాణవాయువును అందించే మొక్కల సంరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతితో కలిసి వనమహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం ద్వారా 53 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 18 లక్షల మొక్కలు, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, కళాశాలలు, రహదారులకు ఇరువైపులా సుమారు 35 లక్షల మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గుంతల త్రవ్వకాలు ప్రారంభించాలని, ఒకే రోజున పెద్ద ఎత్తున ముక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు కట్టలు, కాలువల గట్లపై మొక్కలు నాటాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులలో పెండింగ్ ఉన్న వాటిని పరిశీలించి వెంటనే పూర్తి చేయాలన్నారు. సిర్పూర్ కాగితపు పరిశ్రమ నిర్వహణ దృష్ట్యా ఇక్కడి రైతులకు నీలగిరి, సుబాబుల్ చెట్ల పెంపకంపై అవగాహన కల్పించాలని, ప్లాంటేషన్ల పెంపకం ద్వారా మంచి ఆదాయం వస్తుందని రైతులకు వివరించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను జాప్యం చేయొద్దు

- ఎస్పీ డివి శ్రీనివాసరావు
- పోలీస్ స్టేషన్‌ను తనిఖీ



నవతెలంగాసణ-కెరమెరి

ప్రజా ఫిర్యాదుల విషయంలో జాప్యం చేయొద్దని, మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్‌హెచ్ఓ, విశ్రాంతి, లాక్అప్ తదితర గదులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారో వివరాలు వారి విధుల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ, దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం కోలాం ఝరి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు సిడాం పగ్గు బాయి, వీల్ చైర్, బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్ఐ విజయ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్

నవతెలంగాణ-చింతలమానెపల్లి

మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు చింతలమానపల్లి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా వ్యవసాయ శాఖ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావును నియమించారు. గురువారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | జులై 05, 2024 | www.navatelangana.com

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-జైపూర్



భీమారం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతి పరిక్ష ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించి బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన హెప్సీబా విద్యార్థిని గురువారం ఆ పాఠశాల సిబ్బంది సన్మానించారు. విద్యార్థి హెప్సీబా ఆదర్శంగా తీసుకుని మిగతా విద్యార్థులు చదువుల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయులు విక్రమ్ కుమార్ అన్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివిన హెప్సీబా బాసర ట్రిబుల్ ఐటీలో సీటు దక్కించుకోవడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరి

నవతెలంగాణ-తాండూర్



వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా కనబడే విధంగా అమర్చుకోవాలని తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి అన్నారు. ఐబీ కేంద్రంలో తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్‌తో కలిసి వాహనాల తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్ సరిగ్గా లేని వాహనాలను సర్కిల్ కార్యాలయానికి తరలించి వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర, ఆటో, నాలుగు చక్రాల వాహనాలతో పాటు భారీ వాహనాల కైనా తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కనబడే విధంగా అమర్చుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పేపర్ లీకేజీలతో తీవ్రంగా నష్టపోతున్నారు

- ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు అహ్మద్ పాషా



నవతెలంగాణ-జైపూర్

గత ఐదు సంవత్సరాలుగా కొనసాగుతున్న పేపర్ లీకేజీలతో విద్యార్థులు, నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని ఎన్ఎస్‌యూసీ మండల అధ్యక్షులు అహ్మద్ పాషా అన్నారు. నీట్ సహా ఇతర పేపర్ లీకేజీలను నిరసిస్తూ ఎన్ఎస్‌యూసీ రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బందు పిలుపుకు మద్దతుగా గురువారం ఎన్ఎస్‌యూసీ ఆధ్వర్యంలో మండలంలోని విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీలతో పరీక్షలు రద్దు చేస్తున్నందున లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అవుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో పది నుండి పదిహేను రాష్ట్రాలలో 41 నియామక పరీక్షలు రద్దు చేసినట్లు విమ్మర్శించారు. ఈ కారణంగా దేశ వ్యాప్తంగా సుమారుగా 1.4 కోట్ల మంది ఆశావాహులు తీవ్రమైన నిరాశకు గురయ్యారని ఆవేధన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీల పరంపర ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని విమ్మర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల నాయకులు మణికంఠ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అంధకారంలో మాత శిశు కేంద్రం

- ఇబ్బందులు పడ్డ గర్భిణులు, సిబ్బంది



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణ కేంద్రంలో గల మాత శిశు ఆరోగ్య కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో అంధకారం నెలకొంది. రాత్రి 10:30 గంటలకు కరెంట్ పోవడంతో హాస్పిటల్ ప్రాంగణం అంతా చీకటి మయంగా మారింది. దీంతో హాస్పిటల్‌లో ఉండే గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలతో పాటు పని చేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యలను వారి ఫోన్‌లలో వీడియోలు తీసి పలు సోషల్ మీడియాల్లో పోస్ట్ చేశారు. అదికాస్త బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్‌రావుకు చేరడంతో ఆయన స్పందించారు. ఒక్కసారిగా కరెంట్ పోవడంతో జెనరేటర్ సమస్య ఏర్పడింది అని అది సరి చేసే సరికి రెండు గంటలు పట్టిందని అందువల్లనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు సుపరిండెంట్ హరిశ్చంద్ర వివరణ ఇచ్చారు.

అక్రమంగా ఇల్లును కూల్చారని ఆందోళన



నవతెలంగాణ-నస్పూర్

అక్రమంగా మున్సిపల్ అధికారులు ఇటీవల తమ ఇల్లు నిర్మాణాన్ని కూల్చారని దసరయ్య కుటుంబ సభ్యులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 45 ఠాగూర్ నగర్‌లో గల తన ఇంటి నిర్మాణాన్ని అకారణంగా కూల్చివేశారని ఆరోపించారు. తాను ఇంటి పన్ను చెల్లిస్తున్నానని, కరెంట్ మీటర్ కూడా తన పేరుతోనే ఉందన్నారు. మున్సిపల్ అధికారులకు తమ పత్రాలతో సంబంధం లేకున్నా తీసుకురావాలని ఒత్తిడికి గురి చేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో సెటిల్మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని, లేకుంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని అన్నారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని వారిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు సరి పడా ఎరువులు ఇవ్వాలి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లలో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందివ్వాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి ఇ.సురేఖ ఫర్టి లైజర్ షాప్‌ల నిర్వాహకులకు, డీలర్‌లకు సూచించారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని వ్యవసాయ శాఖ డివిజన్ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నష్టం చేసే ఎలాంటి సందర్భాలకు తావు ఇవ్వకూడదని, విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు అమ్మకుండా ఎంఆర్‌పీ ధరకే విత్తనాలు, ఎరువులు అమ్మాలని తెలిపారు. కొనుగోలు చేసిన ఎరువులకు, విత్తనాలకు రశీదులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఎరువులు అమ్మే సమయంలో ఈపీ ఓఎస్‌లో రైతు వివరాలు తప్పని సరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికే ఇవ్వాలి

- బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యేల వైకరి ప్రకటించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-జైపూర్

కేంద్రంలో 3వ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ నరేంద్రమోడీ సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు పూనుకున్నాడని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి విమ్మర్శించారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటి పిలుపు మేరకు గురువారం చెన్నూర్ పట్టణంలో బొగ్గు బ్లాకుల వేలం పాటలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణికి దక్కాల్సిన బొగ్గు బ్లాకులను ప్రయివేటుపరం చేసుందకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకుల వేలం పాటను రద్దు చేస్తూ నేరుగా సింగరేణికి కెటాయించకుంటే బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బొగ్గు బ్లాకుల వేలం పాటకు జిల్లా పరిధి ఎమ్మెల్యేలు అనుకూలమా..? వ్యతిరేకమా..? వైకరి ప్రకటించాలని ప్రశ్నించారు. ప్రయివేటీకరణ విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వం తమ తీరును మార్చుకోవాలని హితువు పలికారు. రాష్ట్రంలో 8 పార్లమెంట్ స్థానాల్లో గెలువడమే కాకుండా తెలంగాణ ఎంపీ బొగ్గు శాఖ మంత్రిగా ఉండి సింగరేణికి అన్యాయం జరుగుతున్న తీరును గుర్తు చేశారు. సింగరేణిలో కొత్త బావులు తీసుకొస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించిన వారికి నిరాశ ఎదురైందని ఆవేధన వ్యక్తం చేశారు. వేలం పాటను వ్యతిరేకిస్తూ సింగరేణి భవిష్యత్తు దృష్టితో మంచిర్యాల జిల్లా పరిధి ముగ్గురు ఎమ్మెల్యేలు ఎందుకు పోరాడకూడదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఛలో కలెక్టరేట్ విజయవంతం చేయండి

బొగ్గు బ్లాకుల వేలం పాటను రద్దు చేయాలన్న డిమాండ్‌తో శుక్రవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సంకె రవి పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాతిపల్లి నగేష్, సామల ఉమారాణి, సిడం సమ్మక్క, బోండ్ల సరిత, తుమ్మ రేణుక, కామెర సరిత, కామెర మధు, భూపెల్లి మణి, బోయిరె రమాదేవి, బూర్తి వెంకటస్వామి, నాగరాజు, రవికుమార్, నాగ ప్రభాకర్, లక్ష్మన్, సంపత్ పాల్గొన్నారు.

నస్పూర్ : సింగరేణి బొగ్గు గనుల వేలంపాటను వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఐఎన్టీయూసీ ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను వేలంపాట ద్వారా ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం కోసం చేస్తున్న కుట్రలను విరమించుకోవాలని గురువారం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వాల వలననే రాష్ట్రం అప్పుల ఊబిలో కురుకుపోయిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల జాతీయకరణ చట్టం 1973ను 2018 జనవరి 18న రద్దు చేసిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2020 జూన్ 18న కమర్షియల్ మైనింగ్ ప్రతిపాదన బొగ్గు గనులను వేలంపాటలో కేటాయించే ప్రక్రియను ప్రారంభించిందన్నారు. అప్పటి నుండి ఇప్పటివరకు 9 సార్లు జరిగిన వేలంపాటలో 107 బొగ్గు బ్లాక్‌లను అమ్మి వేశారన్నారు. 2024 మళ్ళీ అధికారంలోకి రాగానే అధికార అహంతో 2024 జులై 21న 10వ విడత వేలంపాటను బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభించారని, తెలంగాణకు గుండెకాయ లాంటి సింగరేణి బొగ్గు గనులైన సత్తుపల్లి 3 కోయగూడెం బొగ్గు బ్లాక్ లను అప్పనంగా ప్రయివేటు వాళ్లకు వేలంపాటలో అమ్మేశారని అన్నారు. అఖిల పక్షంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లి సింగరేణిని కాపాడాలని ప్రధానమంత్రిని కోరుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీమ్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవెన శ్యామ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, కేంద్ర కార్యదర్శులు ఎల్ శ్రీనివాస్, సమ్మయ్య మల్లారెడ్డి పాల్గొన్నారు.

సాయుధ పోరులో దొడ్డి కొమురయ్యది చెరగని ముద్ర

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య తనకంటూ చెరగని ముద్ర వేసుకొని చిరస్మరణీయుడిగా నిలిచాడని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్తో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య ఆద్యుడు అని, ఆయన త్యాగం నేటి తెలంగాణ సమాజానికి గణనీయంగా మేలు చేసిందని అన్నారు. సాధారణ గొర్రెల పెంపకందార్ల కుటుంబంలో 1927లో జన్మించి నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి కోసం వీరోచిత పోరాటం చేశారని, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఎనలేని పోరాటం చేశారన్నారు. ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్రాలను అందించేందుకు నిజాంను ఎదురించి పోరాడి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచాడని కొనియాడారు. ప్రభుత్వం మహానుభావుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారంగా నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్కుమార్, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.

హాజరు శాతాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి దోహదపడాలి

నవతెలంగాణ-మందమర్రి



భూగర్భ గనులలో హాజరు శాతాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి దోహదపడాలని ఏరియా జీఎం మనోహర్ ఉద్యోగులకు సూచించారు. గురువారం మందమర్రి సీఈఆర్ క్లబ్‌లో ఆయన ఆధ్వర్యంలో సింగరేణిలో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌కి ఏరియాలోని కాసిపేట-01, 02, శాంతిఖని, కెకె-5, కెకె ఓసి, ఆర్కె ఒసి కార్మికులు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. 2023 సంవత్సరంలో కనీసం 100 మస్టర్లు చేయని, 2024 సంవత్సరంలో మే నెల వరకు కనీసం 50 మస్టర్లు చేయని వారికి జీఎం మనోహర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని మీ తండ్రులు ఉద్యోగం చేసిన సమయంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని, ప్రతి ఒక్క ఉద్యోగి తమ హాజరు శాతాన్ని పెంచుకొని సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సింగరేణి సంస్థ కల్పిస్తున్న సదుపాయాలు మరెక్కడ లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటి నుండి ప్రతినెల 20 మస్టర్లు చేయాలని సూచించారు. 380 గైర్హాజరు ఉద్యోగులకి గాను 117 మంది ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సేవ అధ్యక్షురాలు సవిత మనోహర్, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ రమేష్, పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ విజయప్రసాద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏరియా హెల్త్ ఆఫీసర్ లోకనాథ్ రెడ్డి అన్నారు. గురువారం ఆర్కే న్యూటెక్ గనిలో గని మేనేజర్ స్వామి రాజుతో కలిసి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలతో ఎక్కువ నీరు నిలవడం ద్వారా దోమల బెడద తీవ్రంగా ఉంటుందని, నివాస ప్రాంతాల్లో మురికి నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తద్వారా దోమలు దరిచేరవని డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి అనేది దోమల ద్వారా వ్యాప్తి చెందే భయంకరమైన వ్యాధి అని అన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, ఈ కాలంలోనే డెంగ్యూ వేగంగా వ్యాప్తి చెందుతుందని. ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

అధికారుల సహకారంతో అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-తాండూర్

అధికారుల సహకారంతో తోటి ఎంపీటీసీల తోడ్పాటు తోమండల అభివద్ధికి కృషి చేశానని ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనుభవజ్ఞులైన అధికారులు నాయకుల సహాయ సహకారాలతో అతి చిన్న వయసులో మండల అధ్యక్ష పదవిలో ఐదేళ్లపాటు కొనసాగడం ఆనందంగా ఉందన్నారు. తాండూరు మండల ప్రజల ప్రోత్సాహంతో మండల అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. ప్రధానంగా మండలంలోని బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. అధికారుల సమన్వయంతో విద్యా వైద్యం, రవాణా , స్త్రీ శిశు సంక్షేమం వంటి శాఖలలో పురోగతి సాధించినట్లు తెలిపారు. అనంతరం అధికారులు ఎంపీపీ ఎంపీటీసీలకు సన్మానం చేసి వీడ్కోలు పలియారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గజానంద్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్ ఎంపీఓ అక్తర్ మొయినొద్దీన్, ఎంపీటీసీలు మాసాడి శ్రీదేవి, మొగిలి శంకర్, సిరంగి శంకర్, రజిత రాజన్న, సూరం రవీందర్ పాల్గొన్నారు.

'భావితరాల కోసం మొక్కలు నాటి వాటిని కాపాడుకుందాం'



నవతెలంగాణ-జన్నారం

భవిష్యత్తు కోసం మొక్కలు నాటి కాపాడుకుందామని ఎంపీడీఓ శశికళ అన్నారు. గురువారం మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో ఉన్న హరిత వనాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వనాల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటిని పూర్తిస్థాయిలో సంరక్షించి వృక్షాలుగా తయారు చేసినప్పుడే మంచి ఫలితం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి హరిత తెలంగాణను తయారు చేయడానికి కృషి చేయాలన్నారు. చెట్లే మానవ మొనగాడకు జీవనాధారం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీఓ రమేష్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా జడ్పీ సీఈఓ గణపతి



నవతెలంగాణ-జైపూర్

మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా జడ్పీ సీఈఓ గణపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను మండల పరిషత్ సిబ్బంది శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ, సూపరింటెండెంట్ సంజీవస్వామి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం ప్రత్యేకాధికారిగా చిన్నయ్య

భీమారం మండల ప్రత్యేక అధికారిగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు, మిషన్ భగీరథ ఏఈ విద్యాసాగర్, సూరింటెండెంట్ విజయ్‌కుమార్, ఏపీఓ ఈజీఎస్ జీనత్ పాల్గొన్నారు.

ఉచిత వోల్వో, డంప్, ట్రక్ ఆపరేటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నస్పూర్

పదవ తరగతి పాసై, హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, మూడేళ్ల అనుభవం ఉన్న పరిసర గ్రామాల నిరుద్యోగ యువకులకు ఉచితంగా వోల్వో డంప్, ట్రక్ ఆపరేటర్ శిక్షణ ఇస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా పరిసర గ్రామాల నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారికి వైద్య పరీక్షలు చేసి, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు అర్హులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయోపరిమతి సడలింపు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 10 లోపు శ్రీరాంపూర్ ఎంవీటీసీ కార్యాలయంలో స్వయంగా హాజరై దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

జన్నారం : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో దశలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడుల్లో ప్రవేశాల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో జులై 4 నుంచి 15 వరకు సమర్పించవచ్చన్నారు. పూర్తి వివరాలకు మండల కేంద్రంలో ఉన్న ఐటిఐ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ సురేఖ, షీ టీం సభ్యురాలు రమాదేవి అన్నారు. గురువారం కాగజ్‌నగర్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలన్నారు. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళల రక్షణకే షీ టీంలు పని చేస్తున్నాయని, అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కాగజ్‌నగర్ షీ టీం ఫోన్ నెంబర్ 8712670565ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షి టీం సభ్యురాలు సునీత పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

నవతెలంగాణ-బోథ్



నీట్ పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలన్నారు. దేశవ్యాప్త వామపక్ష విద్యార్థి సంఘాల, విద్యాసంస్థల బంద్‌లో బాగంగా బోథ్‌లోని విద్యాసంస్థలు బంద్ విజయవంతం అయిందన్నారు. 24 లక్షల నీట్ విద్యార్థుల పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీ వైఖరినీ నిరసిస్తూ నిరసన కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించకుండా కౌన్సిలింగ్‌కు పిలవడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృశ్య దేశవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆమెర్, వెంకటరమణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేకాధికారిగా డీటీడీఓ గంగారాం బాధ్యతలను స్వీకరించారు. ఎంపీపీ పదవి కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులకు బాధ్యత అప్పగించగా గంగారాం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గంగారాంను ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, తాజా మాజీ ఎంపీపీ రొడ్డ లక్ష్మీ రమేశ్, ఎంపీఓ నాగరాజు, టైపిస్టు స్వామిలు శాలువాలతో సన్మానించారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ కార్యకలాపాలపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. మూడు రోజుల పాటు సాగే ఈ శిక్షణలో కొత్త పాఠ్యంశాలు, ఈసీసీఈ ఇంపార్టెన్స్, పిల్లల హాజరు పెంపు చేయటం, జూలై నెల కార్యక్రమాల గురించి వివరించినట్లు బెల్లంపల్లి సీడీపీఓ ఉమాదేవి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ కార్యకలాపాల్లో భాగంగా 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఎంత ఎక్కువ నేర్పితే అంత ఎక్కువ నేర్చుకునే వయస్సని, మెదడు పెరుగుదల సమయమని, దీనిని ఆధారంగా పిల్లలకు ఎక్కువ శాతం నేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కరదీపిక, ప్రియదర్శిని బుక్కును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రాధిక, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

లింగాపూర్‌లో దొంగతనం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ గ్రామంలో గురువారం ఉదయం దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన బుఖ్య యమున ఇంట్లో నిద్రిస్తుండగా ఉదయం సుమారు మూడు గంటల ప్రాంతంలో దొంగలు ఇంట్లో చొరబడి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కున్నారు. దీంతో యమున ఒక్కసారి అరవగా ఆమెను నెట్టివేసి అక్కడి నుండి పారిపోయారు. దీంతో యమున తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలుఇ యమున పోలీస్‌స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేయగా డాగ్ స్క్వాడ్ బృందాలను పిలిపించి దొంగల గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

వాహనదారులు తప్ప ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. గురువారం స్థానిక కుర్మపల్లిలో తనిఖీలు నిర్వహించగా నిబంధనలు అతిక్రమించిన సుమారు పదిమంది ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదని, అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు వాహనానికి సంబంధించి అన్ని పేపర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఎవరు వాహనాలు నడపకూడదని, వాహనానికి సంబంధించి నెంబర్ ప్లేట్లు ట్యాంపరింగ్ చేస్తే చీటింగ్ కేసు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అలా చేస్తే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ వద్ద తనిఖీ చేయగా రవితేజ అనే వ్యక్తి వద్ద నుండి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ ఎస్ఐ రమేష్ తెలిపారు. నిందితుడు మహారాష్ట్ర నుండి కొనుగోలు చేసిన గంజాయిని బ్యాగులో రవాణా చేస్తుండగా తనిఖీల్లో గంజాయి పట్టుబడినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యశోద హాస్పిటల్‌లో మెరుగైన వైద్య సేవలు

నవతెలంగాణ-మంచిర్యాల

హైదరాబాద్‌లో గల యశోద హాస్పిటల్‌లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు హాస్పిటల్ డాక్టర్ కరుణ కుమార్ తెలిపారు. గురువారం మంచిర్యాల పట్టణంలో గల ప్రయివేటు హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మంచిర్యాలకు చెందిన 32 సంవత్సరాల సుధీర్ అనే యువకుడు అప్లాస్టిక్ అనీమియాతో బాధ పడుతూ యశోద హాస్పిటల్‌లో చేరడంతో, హాస్పిటల్‌లో బోన్ న్యారో ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కరుణ కుమార్ రోగిని పరీక్షించారు. గతంలో రోగి ఆయుర్వేదిక్ మందులు వాడినప్పటికి జబ్బు నయం కాకపోవడంతో ఎన్ని రకాల చికిత్సలు అందించిన జబ్బు నయం కాలేదని చివరగా స్టెమ్ సెల్ మార్పిడిని ఉపయోగించినట్లు డాక్టర్ తెలిపారు. చికిత్స అనంతరం రోగికి జబ్బు నయం అయి సాధారణ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. రోగి పరిస్థితిని కుటుంబ సభ్యులకు తెలపడంతో సంతోష పడ్డారు. ఇలాంటి దీర్ఘ కాలిక సమస్యలు, అధునాతన మైన వైద్య సేవలు అందించడానికి యశోద హాస్పిటల్‌లో డాక్టర్‌లు అందుబాటులో ఉంటారని సిబ్బంది తెలిపారు. జిల్ల ప్రజలు యశోద హాస్పిటల్ వారు అందించే మెరుగైన వైద్య సేవలు వినియోగించు కోవాలని కోరారు.



దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువలేనిది



నవతెలంగాణ-నిర్మల్

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువలేనిదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య ముఖ్య భూమిక పోషించాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి రాజేశ్వర్ గౌడ్, సహాయ బీసీ సంక్షేమాధికారి సీ.గంగాధర్, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ రాష్ట్రంతో పాటు స్వతంత్ర్యం కోసం అమరులు చేసిన త్యాగలు ఎన్నటికి మరువలేమని అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజేశ్వర్, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, శంకర్, అనసూయ, ఉమ మహేశ్వరి పాల్గొన్నారు.

సింగరేణికే బొగ్గు బ్లాకులను అప్పగించాలి

- ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్
- కాసిపేట గనిపై ఏఐటీయూసీ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-కాసిపేట

కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులపై ఉక్కుపాదం మోపుతుందని, మా బొగ్గు గనులను వేలం వేయకుండా పారదర్శకంగా సింగరేణికే ఇవ్వాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేయడానికి సైతం వెనుకడబోమని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ స్పష్టం చేశారు. గురువారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూలై 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే పోరాట కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సంధర్భంగా బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ జులై 5న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అదే విదంగా జులై 6 నుండి 12వ తేదీ వరకు జీఎం కార్యాలయం ముందు నిరాహార దీక్షలో ఏఐటీయూసీ నాయకులు, సేఫ్టీ కమిటీ సభ్యులు, మైన్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, చొప్పరి శ్రీహరి, వీ రాజేందర్, ఎస్ సురేష్, కే సంతోష్, మైనింగ్ స్టాఫ్ నాయకులు సేద్యం శంకరయ్య, రాజు, రమేష్, ఐ. సంపత్, ఏ తిరుపతి, ఏ సందీప్, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం

ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీనన్ ను అంగన్‌వాడీలు, పంచాయతీ సిబ్బంది గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీగా మహమ్మద్ రియాజుద్దీన్ పదవి కాలం ముగియడంతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీ పాల్ మాజీ ఉపసర్పంచ్ హజారుద్దీన్, కారోబారి బాపన, అంగన్‌వాడీలు సుజాత సునీత విక్టోరియా ఆశా వర్కర్లు గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్ : పదవీ కాలం పూర్తి చేసుకున్న జడ్పీటీసీ సంధ్యారాణి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు తాహెర్ బిన్ సలాం, ఎంపీటీసీలను ఎంపీడీఓ రమేష్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కుర్మే మహేందర్, చాట్ల రజినీ, రజియ బేగం, ఈఓ అంజయ్య, నాయకులు గోపి, చట్ల ఉమేష్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-దండేపల్లి

మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి పి రవీందర్ రెడ్డి గురువారం బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జేఆర్ ప్రసాద్ కార్యాల సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వివిధ పార్టీల నాయకులు, అధికారులు సహకరించాలని అన్నారు.

జైనథ్ : ఇటీవల మండల అధ్యక్షుల పదవీకాలం ముగియడంతో మండలానికి ప్రత్యేక అధికారులను నియామించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వై.సాంబాశివ రావు మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అతను జిల్లా మత్స్యశాఖ అధికారిగా కొనసాగుతున్నారు. ఎంపీడీఓ రవీంద్రనాథ్, సూపరింటెండెట్, సిబ్బంది శాలువతో సత్కరించారు.

తాంసి : జడ్పీటీసీ,ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో మండల పరిషత్‌కు ప్రత్యేక అధికారులు వచ్చారు. గురువారం భీంపూర్ మండల ప్రత్యేక అధికారిగా బి.కిషన్, తాంసి మండల ప్రత్యేక అధికారిగా బి.వెంకటరమణ బాధ్యతలను స్వీకరించారు. కార్యాలయ సిబ్బందితో పాటు ఎంపీడీఓలు మోహన్ రెడ్డి, గోపాల కృష్ణారెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు.

తాండూర్ : మండల అధ్యక్షులు పదవి కాలం ముగియడంతో తాండూర్ మండల ప్రత్యేక అధికారిగా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి గజానంద్ నియామకమయ్యారు. గురువారం ఆయన ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గజానంద్ మాట్లాడుతూ అధికారులు నాయకుల సమన్వయంతో తాండూరు మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో సహకరించాలని కోరారు.

మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

నవతెలంగాణ-జన్నారం

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న జన్నారం మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని సామాజిక ఉద్యమకారుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం సంవత్సరాల తరబడి గ్రామీణ ప్రాంతంగా ఉండి రెవెన్యూ మండలంగా కొనసాగుతుందని అన్నారు. మండలం సుమారు 58, వేల జనాభాతోపాటు, 29 గ్రామపంచాయతిలు, నాలుగు అనుబంధ గ్రామాలు కలిగి ఉందని తెలిపారు. మండల భౌగోళిక విస్తీర్ణం 79.715 ఎకరాలు కలిగి 332,59 చదరపుకిలో మీటర్లు కలిగిఉందన్నారు. మండలానికి ఓ వైపు గోదావరినది, మండలాన్ని ఆనుకొని దట్టమైన అటవీ ఉండటంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. మండలాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం రెవెన్యూ డివిజన్ గా ప్రకటించినట్లయితే మండలం అభివృద్ధి చెందడమేకాకుండా, మండల ప్రజలకు పరిపాలనా అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు.

ఐటీఐలో రెండవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలలో రెండవ విడత ప్రవేశాలకు వివిద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడులలో శిక్షణ పొందడానికి అభ్యర్థులు నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సుజాత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జులై 4 నుండి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలలన్నారు. వివరాల కోసం 9493535378 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులకు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా రాజన్న తెలిపారు. పాఠశాలలో చదివి పదిలో 10/10 జీపీఏ సాధించిన రాథోడ్ ఈశ్వర్ 9.5 జీపీఏ సాధించిన విజయ్ కుమార్ సాయి వర్ధన్ ఎంపికయ్యారన్నారు. వీరికి ఉచితంగా బాసర ట్రిపుల్ ఐటీలో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సును అందించనున్నట్లు తెలిపారు. ఒకే పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం అభినందనీయమని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముఖ కమలాకర్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి

నవతెలంగాణ-సారంగాపూర్

దాతల సహారంతో పాఠశాలల అభివృద్ధి సాధ్యవుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు లక్ష్మీ జగదీశ్వర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు విరాళంగా అందజేశారు. పాఠశాల సూచి శుభ్రతకోసం స్వంత డబ్బులతో ఒకరిని పరాష్ గా నియమించారు. ఈ సందర్భంగా దాతలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గణేష్, ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, శేఖర్, హనుమండ్లు, శ్రీదేవి, ప్రవళిక పాల్గొన్నారు.

ఘనంగా జోగురామన్న జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో జోగురామన్న కలిసి హరితహారంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పలువురు జోగు రామన్నకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జోగురామన్న పుట్టినరోజు సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, పార్టీ నాయకులతో కలిసి వీధి వ్యాపారులకు వర్ష కాలం నేపథ్యంలో రైతుబజార్‌లో గోడుగులను పంపిణీ చేశారు. జోగు రామన్న తన పుట్టిన రోజును పురస్కరించుకోని రిమ్స్ లో రోగులకు, కేఆర్కే కాలనీలో వృద్ధాశ్రమంలో పండ్లను పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్ లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకు ముందు పార్టీ శ్రేణులతో కలిసి జోగు రామన్న భారీ కేక్‌ను కట్ చేశారు. అభిమానులు, పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువతో సత్కరించి జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. అనంతరం అభిమానులు, పార్టీ నాయకులు రక్తదానం చేయగా వారిని ప్రోత్సహిస్తు పండ్ల రసం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్ కౌన్సిలర్లు ప్రకాష్, అశోక్ స్వామి, నాయకులు శివకుమార్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-లోకేశ్వరం

పంచాయతీ కార్యదర్శులు జీపీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంపీడీఓ వెంకట రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీలలో నిధుల కొరత వల్ల సొంత డబ్బులు ఖర్చు చేసి పనులు చేయిస్తున్నామన్నారు. దీంతో అర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని, నిధుల కొరత లేకుండా చూడాలని కోరారు.

నేరాల నియంత్రణకు నిఘా పెంచాలి

నవతెలంగాణ జైనథ్

సరిహద్దున మహారాష్ట్ర ఉందని నేరాల నివారణకు నిఘా పెంచాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. గురువారం జైనథ్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులతో పాటు సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకుంటూ సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఎస్పీ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, పరిసరాలలో మొక్కను నాటారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సెంట్రల్ వాటర్ కమిషన్, కోర్ట చేనేక బ్యారేజ్‌ని సందర్శించారు. ఇందులో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ డి.సాయినాథ్ ఉన్నారు.

రాథోడ్ రమేష్ అకాల మరణం తీరనిలోటు

నవతెలంగాణ-కడెం

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అకాల మరణం జిల్లా ప్రజలకు తీరనిలోటని మండలంలోని అంబారిపేట్ గ్రామస్తులు అన్నారు. గురువారం పార్టీలకతీతంగా గ్రామస్తులు కలిసి రాథోడ్ రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాజకీయ శిక్షణ తరగతులు జులై 6, 7 తేదీలలో ఖానాపూర్ పట్టణంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులను తీసుకోవడానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, బుర్రి ప్రసాద్, గిట్ల ముకుందరెడ్డి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జీ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆడివయ్య హాజరవుతున్నారని అన్నారు. ఈ శిక్షణ తరగతులను పార్టీ కార్యకర్తలు, హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) ఖానాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి డాకూర్ తిరుపతి, మండల కార్యదర్శి నాగేల్లి నర్సయ్య పాల్గొన్నారు.

నాటిన మొక్కను నేనే సంరక్షిస్తా



నవతెలంగాణ-బోథ్

జన్మదిన సందర్భంగా మొక్కను నేనే సంరక్షిస్తానని రామాలయ కమిటీ చైర్మెన్ జీవీ రమణ అన్నారు. గురువారం తన జన్మదినం సందర్భంగా మండలంలోని సొనాల గ్రామంలోని రామాలయం అవరణలోని రామాలయ కమిటీ చైర్మన్ జీవీ రమణ రామ మందిరంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకుంటానని అన్నారు. గ్రామ పెద్దలు, ప్రజలతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయంలోని శ్రీరాముల వారి ఆశీస్సులతో జన్మదినాన్ని జరుపుకోవడమే కాకుండా మొక్కలు నాటడంతో పలువురు పెద్దలు అభినందించడం జరిగిందన్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాప్రతినిధులకు సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ, ఎంపీటీసీల పదవి కాలం ముగిసిన సంధర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రొడ్డ లక్ష్మీ రమేశ్, ఎంపీటీసీలు మెరుగు పద్మ శంకర్, నవనందుల చంద్రమౌళి, కోఆప్షన్ సిరాజ్‌ఖాన్లకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ జెడ్పీటీసీ రౌత్ సత్తయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు దుర్గం పోశం, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, జాకీర్, మడావి వెంకటేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ ప్రశాంతం

నవతెలంగాణ-కాసిపేట

నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ చేపట్టిన విద్యా సంస్థల బంద్ గురువారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఎస్ఈయూఐ మండల అధ్యక్షుడు విద్యాసాగర్ ఆధ్వర్యంలో పాఠశాలలను బంద్ చేయించారు. దేవాపూర్ ప్రాంతంలో ఎస్ఎఫ్ఎ మండల కార్యదర్శి కొమ్ముల రజిత ఆధ్వర్యంలో పాఠశాలలను బంద్ చేయించారు. ఎన్టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి



నవతెలంగాణ-జన్నారం

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులతో మర్యాదగా ప్రవర్తించాలని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ అన్నారు. గురువారం జన్నారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్‌నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో లక్సెటిపేట సీఐ అల్లం నరేందర్, జన్నారం ఎస్ఐ రాజా వర్ధన్ అదనపు ఎస్ఐ సర్వార్ పాల్గొన్నారు.